# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## వరద బాధితులకు రూ.1.25 లక్షల విరాళం అందజేసిన టీడీపీ నాయకులు



**కందుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** విజయవాడ వరద బాధితులకు సహాయం అందించాలన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుతో విరాళాలు అందించేందుకు పలువురు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యేని కలిసి వరద బాధితుల సహాయార్ధం రూ.1.25 లక్షల విరాళాన్ని అందజేశారు. కందుకూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాల్‌రావులు రూ.20వేలు చొప్పున విరాళం ఇచ్చారు. ఉలవపాడు మండల టీడీపీ అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు, ఉలవపాడు మండలం కృష్ణాపురం గ్రామ టీడీపీ అధ్యక్షులు చక్రవర్తుల విజయకుమార్‌లు చేకొక రూ.10వేలు, కందుకూరు పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు వడ్డెళ్ళ రవిచంద్ర 5 వేలు రూపాయలు చొప్పున మొత్తం రూ.1.25 లక్షలు విరాళాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావుకి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులందరిని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభినందించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితుల కోసం మనమందరం అండగా నిలబడాల్సిన అవసరం ఉందని అన్నారు. వరద బాధితుల కోసం ఇప్పటి దాకా నగదు, వస్తు రూపంలో సహాయం అందించిన నియోజకవర్గంలో చెందిన దాతలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

## నియోజకవర్గ ముస్లింలకు మీలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు



**కందుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను బోధించిన మొహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల నడుమ మీలాద్ - ఉన్- నబి జరుపుకోవాలని మాజీ మంత్రి వర్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముస్లిం సోదరీ, సోదరులందరికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫోక్సో కేసు నమోదు

**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** : కోవూరులోని శాంతినగర్ 6వ వీధి ప్రాంతంలో శనివారం ఓ ఏడేళ్ల చిన్నారిపై అదే ప్రాంతానికి చెందిన మధు అనే యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆ చిన్నారి పెద్దగా కేకలు వేయడంతో ఆ యువకుడు పరారయ్యాడు. ఈ మేరకు బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఫోక్సో కేసును నమోదు చేశారు. పరారైన యువకుడిపై గాలింపు చర్యలు చేపట్టారు.

## వ్యసనాలకు బానిసై దొంతనాల బాటపట్టి



**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** చెడు వ్యసనాలకు బానిసై, అవసరమైన నగదు కోసం దొంగతనాలను అలవాటుగా చేసుకున్న నిందితుడు చిట్ట చివరకు రూరల్ పోలీసులు చేతికి చిక్కాడు. నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ డిఎస్పి జి. శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఇటీవల నెల్లూరు నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న చోరీలపై ఎస్పి కృష్ణకాంత్ ఆదేశాలతో రూరల్ డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నెల్లూరు రూరల్ ఇన్స్పెక్టర్ జి. వేణు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో చోరీ చేసిన సొత్తుతో చెన్నై వెళ్లేందుకు నెల్లూరు ఆర్టీసి బస్టాండ్‌లో వేచి ఉన్న వడపర్తి సతీష్ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విడవలూరు మండలం వావిళ్ళ గ్రామానికి చెందిన సతీష్ కుమార్ చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. దొంగతనాలు చేయడం వచ్చిన నగదుతో జల్సాలు చేయడం చేసేవాడు. పలు దొంగతనాల కేసుల్లో జైలు కూడా వెళ్లి వచ్చి ఉన్నాడు. పోలీసు దర్యాప్తులో మే 14న జైలు నుండి విడుదలైన సతీష్ కుమార్ రూరల్ మండలం ఆమంచర్ల గ్రామంలో ఉంటున్న ఓరుపల్లి అశోక్ కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో మే 15వ తేదీ చోరీ చేసాడు. అలాగే జూలై 24న చిలుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోని ఓ ఇంట్లోనూ, ఆగస్టు 29న వెంకటాచల సత్రం మండలం కసుమూరు గ్రామంలో మరో ఇంట్లోనూ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇదే క్రమంలో ఈ నెల 12న బస్టాండులో బస్సు కోసం వేచి ఉన్న లక్ష్మీ ప్రసన్న అనే మహిళ బ్యాగులోను నగలకు తస్కరించాడు. పోలీసుల దర్యాప్తులో ఈ నేరాలన్నీ తానే చేసినట్లు అంగీకరించిన సతీష్ కుమార్ వద్ద నుండి 35 సవర్ల బంగారు నగలు 100 గ్రాముల వెండి ఆభరణాలు, నేరాలకు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ 17 లక్షల వరకు ఉంటుందని డిఎస్పి తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన రూరల్ ఇన్స్పెక్టర్ జి. వేణు, ఎస్ఐ లక్ష్మణరావు, హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్, ఆదినారాయణ, సిసిఎస్‌ఏఎస్ఐ వెంకయ్య, హెడ్ కానిస్టేబుల్ వారిస్ అహ్మద్, భాస్కర్ రావు, కానిస్టేబుళ్లు అల్లాబక్షు, పి. శ్రీనివాసులు, మహబూబ్ భాషా, శివకుమార్‌లను ఎస్పి అభినందించి రివార్డులు ప్రకటించినట్లు డిఎస్పి తెలిపారు.

## ప్రశాంతమ్మా.... ఈడ్రైన్లు గురించి పట్టించుకోమ్మా



**బుచ్చి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ముఖ్యమైన మలిదేవి డ్రైన్,చెల్లాయపాళెం డ్రైన్ పూర్తి స్థాయిలో పూడి పోయి ఉన్నాయి. రాబోయేది వర్షాకాలం ఏ మాత్రం వర్షాలు ఎక్కువై కనిగిరి రిజర్వాయర్ నిండి ముంబాయి కలుజులు ఎత్తితే మలిదేవి డ్రైన్ పొంగి కాశీపాళెం పలు ప్రాంతాలు ముంపుకు గురై అవకాశం ఉంది. అలాగే వందల ఏకరాలకు మురుగు నీరు తీసుకొని వెళ్లే చెల్లాయపాళెం డ్రైన్ పరిస్థితి కూడా అంతే వర్షాలు విస్తారంగా కురిస్తే నీరు ముందుకు సాగాక పంచేడు,సాల్మాన్‌పురం, తదితర గ్రామాల పొలాలు అన్ని మునిపోతాయి. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి ఈడ్రైన్లు పూడిక తీయించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

## వినాయకుని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని తానికొండవారి కొష్టాలు దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుని కమిటీ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వినాయకుడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కందుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని గోకరాజుపాలెంలో ఆదివారం మధ్యాహ్నం వినాయకుడి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కావలి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కావలి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** కావలి రైల్వే స్టేషన్‌లో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీస్ స్టేషన్ మధ్యలో 3వ నెంబరు ఫ్లాట్‌ఫారంపై గుర్తు తెలియని 35 సంవత్సరాల వ్యక్తి ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే ఆదివారం మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతుడు వేసుకున్న బ్లూచొక్కా, తెలుపు రంగు గల చెక్స్ కలిగిన ఫుల్‌హ్యాండ్ చొక్కా, పింక్ కలర్ బ్లూ చెక్స్ కలిగిన లుంగీ ధరించి వున్నట్లు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోనలో శాస్త్రోక్తంగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని పవిత్రోత్సవాలు ప్రారంభం



**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు15ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో స్వామి వారి పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆదిలక్ష్మి,చెంచులక్ష్మి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వార్లను ఆస్థాన మండపంలో వేంచేపు చేసి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేన, నెయ్యి, పంచదార, కొబ్బరనీళ్ళు, పసుపు, చందనంలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం (అభిషేకం), నిర్వహించారు. రాత్రి 7 గంటల నుండి ఆలయంలోని యాగశాలలో స్వామి వారికి వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్రాలకు ప్రతిష్ట నిర్వహించారు. యాత్రికుల వల్లగాని, అర్చకులవల్లకాని, సిబ్బంది వల్ల గాని తెలిసి,తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం అనవాయితీగా జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ



సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ,అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, నాగరాజు స్వామి, వర్ధన్ స్వామి, వినోధ్ స్వామి, వేదపండితులు,ఉభయకర్తలు,ఆలయ సిబ్బంది,పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.వి.కన్వెన్షన్‌లో వెంకటేశ్వరస్వామి కళ్యాణం



**వింజమూరు, సెప్టెంబర్15ప్రభాతవార్త:** వింజమూరులోని ఎస్‌వికన్వెన్షన్ హాల్లో శ్రీవెంకటేశ్వరసా వ్యమి కళ్యాణోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో తిరుమలాచారి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవాన్ని ఉభయకర్తలు గురజాలప్రసాద్-ప్రవీణ దంపతులు , కాకర్ల వెంకట్ -రుక్మిణి , కె.వి.రత్నం-విజయలక్ష్మి, గురజాల రాజ-మౌనిక, పెమ్మసాని శ్రీధర్-శైలజ దంపతులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో స్వామివారి కళ్యాణ వేదికను సుందరంగా అలంకరించారు. శ్రీదేవి-భూదేవి అమ్మవార్లను పెళ్ళికుమార్తెలుగా ముస్తాబు చేసి కళ్యాణవేదికపైకి తీసుకువచ్చారు. వెంకటేశ్వరస్వామి పెళ్ళికుమారుడిగా ఉత్సవ మూర్తులను అలంకరించారు. ముందుగా గణపతి పూజ నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరయ్యారు. స్వామివారి కళ్యాణం అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ పవిత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించడం వలన దృష్టిదోషాలు పోతాయన్నారు. స్వామివారి ప్రసాదాలను పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో ఎస్‌వికన్వెన్షన్ హాల్ మేనేజర్ గురజాల గోపికృష్ణ, నాయకులు యారం కృష్ణయ్య, దామా



మహేష్, వికాస్ హరికృష్ణ, మధురెడ్డి, పాములపాటి మాల్యాద్రి,కర్న శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గంధమహోత్సవం





**బుచ్చి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని ఖాజనగర్‌లో స్థాపించబడిన " ఆస్తానయో,ఖాదరియా" పీఠాదిపతి ఖాజా అబుల్ ఇర్ఫాన్ షా మొహమ్మద్ అబ్దుల్ అజీజ్‌ఖాలిది ఖాదరియా " పీఠాదిపతి ఖాజా అబుల్ ఇర్ఫాన్‌షా మొహ్మమద్ అబ్దుల్ అజీజ్ ఖాదరి,చిష్తి, సుహార్ వర్ది ఆద్వర్యంలో " మస్‌జిద్ అల్‌మీన్" కమీటి అద్యక్షులైన జనాబ్ సయ్యద్ సర్దార్ సాహెబ్ నాయకత్వాన మసీదు కమీటి సభ్యులు గ్రామస్తుల సహకారంతో మిలాదునబి జగత్ ప్రవక్త 1453 వ జన్మదినోత్సవం సందర్భంగా మేళతాళలతో ఉరేగింపు నిర్వహించారు.ఈ సందర్భంగా గురువులు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. శాంతిసందేశానికి మారుపేరు ఇస్లాం,శాంతిదూత జగత్ ప్రవక్త హాజరత్ మహమ్మద్ ముస్తాపా సొల్లేల్లాహు అలైహి వసల్లిమ్‌అరేబియా దేశంలోని సుప్రసిద్ద పుణ్యక్షేత్రమైన మక్కా నగరంలో 571 సంవత్సరంలో జన్మించారని తెలిపారు. వారి కృషి ఫలితంగా నేడు ప్రపంచములోని నలు మూలలలో ఇస్లాం మతస్తులు ఉన్నారని చెప్పారు. మానవసేవే మాధవసేవ అన్నదే ఆయన మత ప్రచారంలోని ముఖ్య సారాంశం అని తెలిపారు.ఈ గంధ మహోత్సంలో పెద్దఎత్తున భక్తులు పాల్గోన్నారు.

## దేవదేవుడుని దర్శించుకున్న సోమిరెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త- వైద్యం** తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం తిరుమలలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మూడో సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారి శ్రీవారిని దర్శనానికి వచ్చిన సోమిరెడ్డి ఆయన వెంట తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి కుటుంబంతో పాటు కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధు కుటుంబ సభ్యులు ఉన్నారు. శ్రీ వారి దర్శనం అనంతరం ఆలయ మర్యాదలతో చంద్రమోహన్‌రెడ్డిని సత్కరించారు. అనంతరం చంద్రమోహన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆ దేవదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని, రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకున్నానన్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక కష్టాలు నుంచి విముక్తి కల్పించడంతో పాటు అద్భుతమైన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే శక్తిని చంద్రబాబునాయుడుకి ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నానని ఆయన తెలిపారు. మొన్న వరదలు పోటెత్తిన సమయంలో ప్రకాశం బ్యారేజీ పైకి వదిలిన బోట్ల వెనుక ఎవరున్నారో వాటి రంగులే చెబుతున్నాయి, పొరపాటున ఏమైనా జరిగివుంటే పరిస్థితి ఏంటి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గాడి తప్పిన వ్యవస్థలన్నింటిని సక్రమ మార్గంలో పెట్టి ప్రజలకు మంచి పాలన అందించేందుకు దేవుడి ఆశీస్సులతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీడియో, రీల్స్ పోటీలు

Scan me !

### చారిత్రాత్మక ప్రదేశాలు, ప్రముఖ ఆలయాల ఔన్నత్యం తెలిపేలా వీడియో లేదా రీల్స్ రూపొందించాలి

### ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో పంపాలి

### జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మన జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలు, సముద్రతీర ప్రాంతాలు, ప్రముఖ ఆలయాల ఔన్నత్యం తెలిపేలా వీడియో, రీల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎనిర్వహించ నున్న ఈ వీడియో పోటీలకు 1 నిమిషం నిడివి గల వీడియోలు లేదా 15 నుంచి 30 సెకన్ల నిడివి గల రీల్స్ ను పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల ప్రకృతి ప్రేమికులు జిల్లాలో ప్రసిద్ధ చెందిన దర్శనీయ ప్రదేశాలైన ఉదయగిరి దుర్గం, మైపాడు బీచ్, ఇసుకపల్లి బీచ్ లైట్ హౌస్, రామాయపట్నం బీచ్, లైట్‌హౌస్, జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవారి ఆలయం, నరసింహకొండలోని శ్రీ మాల్యాద్రి వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, పెంచలకోనలోని శ్రీ పెనుశిల నరసింహస్వామి ఆలయం, నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, కండలేరు డ్యాం, రిజర్వాయర్, సోమశిల డ్యాం, రిజర్వాయర్ మొదలైన పర్యాటక ప్రదేశాలు కవర్ అయ్యేలా ఒక నిమిషం నిడివి గల వీడియో లేదా 15 నుంచి 30 సెకన్ల నిడివి గల రీల్స్‌ను చిత్రీకరించి క్యూఆర్ కోడ్ ద్వారా ఈ నెల 22లోగా ఆన్‌లైన్ పద్ధతిలో పంపాలని ఆయన కోరారు. అత్యుత్తమ వీడియో, రీల్స్ చిత్రీకరించిన విజేతల కు మొదటి బహుమతి రూ. 15 వేలు, 2వ బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు, ఐదుగురికి రూ. వెయ్యి చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేయను న్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి సెల్ నెంబర్ 9848007024ను సంప్రదించాలని ఆయన సూచించారు

## దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం

### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



**దగదర్తి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** దగదర్తి గ్రామం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం ఆర్‌అండ్‌బి రోడ్డు పనులను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి పునఃప్రారంభించారు. వేదమంత్రాల మధ్య టెంకాయ కొట్టి రోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. 2021 సంవత్సరంలో దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం ఆర్‌అండ్‌బి రోడ్డు మంజూరైనా పనులు నత్తనడక నడిచాయన్నారు.అయితే ఇక నుంచి త్వరగా రోడ్డు పనులు పూర్తయ్యేటట్లు చూస్తామన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగకుండా త్వరగా వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. డబుల్ రోడ్డు మంజూరు కావడంతో అంత స్థలం లేకపోవడంతో రైతుల వద్ద కొంత స్థలాన్ని తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి రైతులకు త్వరగా దానికి సంబంధించిన డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారన్నారు. రోడ్డు బాగోలేక రైతులు, ప్రయాణికులు ఇబ్బందలు పడుతున్నారన్నారు. ఇకపై ఆ ఇబ్బందులు లేకుండా చూస్తానని తెలిపారు. త్వరలో దగదర్తి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభిస్తామన్నారు. దగదర్తి మండల ప్రజలు, కార్యకర్తలు పనులపై వచ్చినప్పుడు పార్టీ ఆఫీసులో సేదతీరి వెళ్లవచ్చునని తెలిపారు. అంతేకాకుండా దగదర్తి మండలంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా నా దగ్గరకు రావచ్చని భరోసా ఇచ్చారు. అనంతరం మండల ప్రజల నుంచి వారి సమస్యల అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.రవికుమార్,శ్రీహరి, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్షా 20 వేలకు లడ్డు వేలం పాట



**సీతారామపురం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని గుండుపల్లి గ్రామంలో పోలేరమ్మ పొంగళ్ళ కార్యక్రమం గ్రామ కమీటి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఇటీవల వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా కమీటి సభ్యులు నిర్వహించిన లడ్డు వేలం పాటలో స్వామి వారి లడ్డును గుడ్డుపల్లి గ్రామానికి చెందిన కప్పా ప్రదీప్‌రాజు ఒక లక్షా 20 వేలకి లడ్డును సొంతం చేసుకున్నారు. కలిశం కాకు వెంగయ్య 21 వెయ్యికి, చెరుకు కాటసాని రాకేష్ 10 వేలకు దక్కించుకున్నారు. అదే విధంగా శనివారం శ్రీకోదండరామస్వాముల వారికి ప్రత్యేకపూజలు నిర్వహించి పలు రకాల నైవేద్యాలను ప్రజలకు గ్రామస్తులకు అందించారు. అనంతరం ఆదివారం గ్రామ ప్రజలు పోలేరమ్మకు ఘనంగా పొంగళ్ళను నిర్వహించారు. భారీగా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఇటీవల జరిగిన వినాయక చవితికి కోదండరామస్వామి కి పూజలు అలాగే పోలేరమ్మకు పొంగళ్ళ కార్యక్రమాలు ఘనంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలను ఉత్సవ కమీటి సభ్యులు తెలియజేశారు.

## గిరిజనులకు అన్నదానం చేసిన సంయుక్త సేవా సంస్థ



**కావలి రూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** కావలి పట్టణానికి చెందిన స్వర్గీయ పోలేపల్లి శ్రీధర్‌కుమార్ జ్ఞాపకార్థం వారి సతీమణి శైలజ, కుమారుడు కుషల్ జయంత్‌లు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో కావలి మున్సిపాల్టీ పరిధిలోని బుడమగుంట గిరిజనులకు అన్న దానం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడారు. తమ సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాత శైలజకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పోలేపల్లి శ్రీధర్‌కుమార్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్ధిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు వారి కుటుంబ సభ్యులు సుందరరావు, రాపూరి హరిలు పాల్గొన్నారు.

## సియం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్రల చిత్రపటాలకు పాలాభిషేకం




**కావలి రూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఫోర్స్‌మెంట్(సెబ్) శాఖను ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పిలుపు మేరకు కావలి పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సిఐ లక్ష్మణస్వామి ఆధ్వ ర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ లక్ష్మణస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖలను వేరు చేయడం వల్ల ఉద్యోగం చేయాలంటే ఇబ్బందులు పడటం జరిగిందన్నారు. ప్రస్తుతం రెండు శాఖలను కలపడం వల్ల అధికారులు, సిబ్బంది చురుకుగా విధులు నిర్వహించేందుకు వీలవు తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి కొల్లు రవీంద్రకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నా జీవితం తెలుగుదేశం పార్టీకే అంకితం !




**కావలి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** నా చివరి రక్తపు బొట్టు వున్నంత వరకు నా జీవితం తెలుగుదేశం పార్టీకే అంకితమని, ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లు నా దైవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాలేపాటి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును జైలుకు పంపితే దగదర్తి మండలంలో బాణాసంచా కాల్చి పండుగ చేసుకున్న వైసిపి కార్యకర్తలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి ఫ్లెక్సీలపై వారి ఫోటోలు వేయించుకుంటే ఏమిటని ఆయన ప్రశ్నించారు. అలాంటి వైసిపి వారిని పమిడి తన చుట్టు తిప్పుకుంటుంటే ఈ మండలంలో తెలుగుదేశం పార్టీ ఎటు పోతుందో అర్ధంకాని పరిస్థితి వుందన్నారు. ఇలాంటి సంఘటనలకు సంబంధించి రుజువులతో చంద్రబాబునాయుడుకు తెలియజేస్తానని మాలేపాటి తెలిపారు. గత 42 ఏళ్లుగా మా కుటుంబం తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతుందన్నారు. మా నాన దగ్గర నుంచి ఇప్పటి వరకు పార్టీలోనే కొనసాగు తున్నామన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడుతున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే మాలేపాటి అని, మాలేపాటి అంటే తెలుగుదేశమని తెలిపారు. ఈ విషయం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. అలాగే తనపై ఎవరో ఫిర్యాదులు చేస్తే భయపడేది లేదన్నారు. తన బయోడేటా మొత్తం చంద్రబాబునాయుడుకు తెలుసునన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తనను తెలుగుదేశం పార్టీ నుండి వేరు చేయలేరని మాలేపాటి హెచ్చరికలు చేశారు.

**దగదర్తి మండలంలో జరిగే అభివృద్ధి సమాచారం లేదు...** దగదర్తి మండలంలో జరిగే అభివృద్ధి, కార్యక్రమాలకు టిడిపి పార్టీ నుండి తనకు ఎటువంటి సమాచారం లేదని మాలేపాటి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మాలేపాటి కుటుంబానికి తెలియకుండా ఏ పని చేసేది లేదని మాట ఇచ్చిన కావలి ఎమ్మెల్యే ప్రస్తుతం మాట తప్పారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎవరికి అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. వారి కోసం ఎన్ని కష్టాలు పడేందుకైనా సిద్దంగా వున్నానన్నారు. మా దైవాలైన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌బాబులు వున్నారని మా సమస్యలు వారికి విన్నవించుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

**వైసిపి పాలనలో కావలి నియోజకవర్గంలో వైసిపి దాడులు, అరాచకాలు...** కావలి నియోజకవర్గంలో వైసిపి నాయకులు దాడులు చేసి అరాచకాలు సృష్టిస్తుంటే భయపడి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు బయటకు రాని పరిస్థితులలో గత మూడున్నర సంవత్సరాల క్రితం టిడిపి కావలి నియోజకవర్గ బాధ్యతల్ని తనకు అప్పగించడం జరిగిందని మాలేపాటి తెలిపారు. ఆనాడు కావలిలో అడుగుపెట్టి టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ధైర్యం చెప్పి అండగా నిలిచానన్నారు. నేనున్నాను...మన అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు వున్నాడని కార్యకర్తలకు భరోసా కల్పించి వైసిపి ఆగడాలను అడ్డుకున్నానన్నారు. వైసిపి చేసే అరాచకాలను అడ్డుకోవడంతో తనపై 16 కేసులు పెట్టారన్నారు. అయినా భయపడ లేదన్నారు. ముసునూరులోని దళిత యువకుడు దుగ్గిరాల కరుణాకర్ ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబానికి అండగా నిలబడ్డానన్నారు. అలాగే అమరావతి రైతుల పాదయాత్ర వచ్చినా, ఇదేమి ఖర్మ కార్యక్రమానికి చంద్రబాబునాయుడు వచ్చినా, యువగళం పాదయాత్రలో లోకేష్‌బాబు వచ్చినా అన్ని కార్యక్రమాలను ఎంతో విజయవంతం చేశానన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే మాలేపాటి, మాలేపాటి అంటే చంద్రబాబు అనే విధంగా పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేశానన్నారు. రైతుల కోసం కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో వంటావార్పు కార్యక్రమాలు చేశానన్నారు. తుమ్మలపెంట రోడ్డు కోసం బురదలో పొర్లాడి నిరసనలు వ్యక్తం చేశామన్నారు. వైసిపి అరాచకాలను ఎండకడుతూ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇవన్ని తెలుగుదేశం పార్టీ కోసమే చేశానన్నారు.

**అరాచకాలను సృష్టించిన వైసిపి నాయకుల్ని చేర్చుకుంటే సహించేది లేదు...** తెలుగుదేశం పార్టీ నాయకులపై దాడులు చేసి అరాచకాలు సృష్టించిన వైసిపి నాయకులను, కార్యకర్తలను చేర్చుకోవాలనుకుంటే సహించేది లేదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు హెచ్చరికలు చేశారు. అవసరమైతే టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగ్గరే ఈ బాగోతంపై తేల్చుకుంటానని హెచ్చరికలు చేశారు. నేను చేసిన ప్రతి పోరాటం నా కుటుంబం కోసం కాదని తెలుగుదేశం పార్టీ కోసం, ప్రజల కోసం చేశానని మాలేపాటి తెలిపారు. నా జీవితాంతం తెలుగుదేశం పార్టీకి రుణపడి వుంటానని మాలేపాటి తెలిపారు.

## ధాతృత్వం చాటుకున్న దంతులూరి



**వింజమూరు, సెప్టెంబర్15ప్రభాతవార్త:** ఉదయగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దంతులూరి వెంకటేశ్వరరావ్ వరద బాధితుల సహాయార్ధం 45వేల రూపాయల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అందజేసి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా దంతులూరి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడ అతలాకుతలమైన నేపథ్యంలో చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఎమ్మెల్యే సురేష్ వరద ప్రాంతాల్లో 10రోజులపాటు పర్యటించి వారికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని, ఎమ్మెల్యే చూపుతున్న సహాయాన్ని చూపి తానుకూడా వరద బాధితులకు తనవంతు సహాయాన్ని అందించానన్నారు. దంతులూరి ప్రవీణ్, కొండపల్లి వెంకటేశ్వర్లు, కోవి రమణారావ్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా 11 కెవి విద్యుత్ తీగలు

**విడవలూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** మండల ముదివర్తి పంచాయితీ చిలికల గ్రామం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట విద్యుత్ 11 కెవి తీగలు ప్రమాదకరంగా ఉండడంతో అటుగా వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రతి నెల రైతుల మోటర్లు, ఇల్లు కరెంట్ బిల్లు ఇవ్వడానికి వెళ్తు వస్తుంటారు. కానీ చేతికి అందే విద్యుత్ తీగలు విద్యుత్ శాఖ అధికారులకు కనిపించదా అని పలు అనుమానాలకు దారి తీస్తుంది. విద్యుద్ శాఖ దళితుల పట్ల ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో పేద ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుకుంటున్నారని ఈ సమస్యపై కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని స్థానిక ప్రజలు తెలియజేశారు.

## వైభవంగా వినాయక నిమజ్జనం



**విడవలూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** మండల కేంద్రం పశువైద్యశాల వీధిలో వినాయక నిమజ్జన ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో గణపతి పప్పా హోరియా అంటూ మహిళలు, యువకులు ఎంతో ఉత్సాహంగా ఉత్సవాన్ని రామతీర్థం సముద్ర తీరానికి సాగించారు. స్వామి వారు మేళతాళాల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వినాయక హేమ శ్రీ క్యాటరింగ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం భక్తులకు పంచి పెట్టారు. ఆరుద్ర గంగాధర్, మనోజమ్మ, శరణ శ్రీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో స్థలదాత పోనక కనకమ్మ వర్ధంతి



**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ప్రముఖ స్వాతంత్ర్య పోరాట యోధురాలు ఆశ్రమ స్థలదాత పోనక కనకమ్మ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మం జుల గురుకుల ఉపాధ్యాయు రాలు చింతపంటి జ్యోతి, పోనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రము పూలమాల సమర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, గణేశం దయాకర్‌రెడ్డి, దువ్వూరు రామ్‌మోహన్‌రెడ్డి నూలు వస్త్రం, ఖాదీమాల సమర్పించారు. అనంతరం కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తెలుగుజాతి మరచిపోయిన తొలి మహిళా స్వాతంత్ర్య పోరాట యోధురాలు పోనక కనకమ్మ నెల్లూరు జిల్లాలోని మినగల్లు గ్రామంలో మరుపూరు కొండారెడ్డి, కమ్మ దంపతులకు కనకమ్మ 1892 సంవత్సరం జూన్ 10వ తేదీన జన్మించారు. వీరు భూస్వామ్య కుటుంబం. తరువాత క్రమంలో ఈమె గాంధీజీ శిష్యురాలిగా మారారు. 1913వ సంవత్సరంలో సుజన రంజని సమాజం ఏర్పాటు చేసే హరిజనోద్ధరణకు కృషి చేశారు. పల్లెపాడులో సత్యాగ్రహ ఆశ్రమాన్ని 1921లో మహాత్మాగాంధీతో ప్రారంభిం పచేశారు. ఈ ఆశ్రమం కోసం కనకమ్మ తన ఒంటిపైనున్న బంగారు నగలు అమ్మి విరాళంగా ఇచ్చారు. ఆనాటి నుంచి తుదిశ్వాస విడిచే వరకు ఆమె బంగారు నగలు ధరించలేదు. పల్లెపాడు పెన్నానది ఒడ్డున గాంధీ ఆశ్రమం కోసం 13 ఎకరాలు కొనుగోలు చేసి ఉచితంగా ఇచ్చింది. కనకమ్మ లాంటి మహోన్నత వ్యక్తులను మనం మన గాంధీ ఆశ్రమంలో స్మరణ చేసుకోవడం మన అందరి బాధ్యత ఇలాంటి మహిళ మూర్తులను మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోనక కనకమ్మ దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన వీరవనిత పోనక కనకమ్మ 1963 సెప్టెంబర్ 15న కన్నుమూశారు. మహిళా జాతికి వెలుగుచుక్కయిన కనకమ్మ స్మృతికి నెల్లూరు నగరంలో కనీసం శిలావిగ్రహం ఏర్పాటు చేయకపోవడం అన్యాయం. కనకమ్మ జీవితకథను పాఠ్యాంశంగా చేర్చి మహిళా స్ఫూర్తికి ప్రభుత్వం ముందుకొచ్చినప్పుడే ఆమెకు సరైన నివాళి అవుతుందని ఆయన తెలియజేశారు. దువ్వూరు రామ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 1930లో పల్లెపాడులో జరిగిన ఉప్పు సత్యాగ్రహం కార్యక్రమంలో కనకమ్మ ప్రముఖ పాత్ర వహించారు. ఆమె నాయకత్వంలో మైపాడుకు భారీ స్థాయిలో మహిళలు తరలివెళ్లారు. అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమెకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ శిక్షకులు, శిక్షణార్ధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కావలి రాజకీయ పరిణామాలపై ముచ్చటించుకున్న మాలేపాటి, మన్నవ



**కావలి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదివారం కావలిలోని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర నివాసానికి వెళ్లారు. అక్కడ ఇదరు అల్పాహారం తీసుకున్నారు. కావలిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఇద్దరు సుదీర్ఘంగా చర్చించుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

## రేవూరులో ముగిసిన వినాయకచవితి వేడుకలు



**అనంతసాగరం, సెప్టెంబర్15ప్రభాతవార్త:** మండలంలోని రేవూరులో వినాయకచవితి పండుగ సందర్భంగా శ్రీతేజోసాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రవాస భారతీయుడు బోయిళ్ళ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 7వ తేదీ నుండి ప్రనారంభమైన వినాయకచవితి నవరాత్రి వేడుకలు 9వ రోజు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిదిరోజులపాటు వినాయక చవితి ఉత్సవాలు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. 9వరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి కోలాటం మధ్య వినాయకుడిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వినాయకుడిని నిమజ్జనం చేశారు. భక్తులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు మిలాద్ ఉన్ నబీ పండుగ

**పొదలకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ముస్లీంల పండుగల్లో ఒకటైన మిలాద్ ఉన్ నబీను సోమవారం వైభవంగా జరుపుకోనున్నట్లు ముస్లిం మతాధికారి మౌలన ముస్తక్ మదని అన్నారు. అల్లాహ్‌కు అత్యంత ప్రీతిపాత్రుడైన ముఖ్య శిష్యుడు మహమ్మద్ ప్రవక్త మిలాద్ ఉన్ నబీ రోజున జన్మించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. అలాగే పవిత్ర ఖురాన్ గ్రంథం భూమిపై అవతరించిన రోజుగా కూడా భావిస్తారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు ఐదు పూటల నమాజ్ అనంతరం రాత్రి 9 గంటల నుండి అన్ని మసీదుల్లో రాత్రంతా జాగారం చేస్తూ, ప్రత్యేక ప్రార్ధనలు చేస్తూ, మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర గురించి వివరించడం జరుగుతుందన్నారు. అందువల్ల మండలంలోని ముస్లిం సోదరులంతా తప్పకుండా హాజరు కావాలన్నారు.

## వినాయక నిమజ్జనంలో అపశృతి..

### టపాసులు పేలి 30 మందికి గాయాలు

**మనుబోలు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** మండల కేంద్రమైన మనుబోలు కోదండరామపురం బీసీ కాలనీలో వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. టపాసులు పేలి 30మందికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన పూర్వపరాలుగా ఈ విధంగా ఉన్నాయి. వినయక చవితి పండుగ తరువాత ఆదివారం సాయంత్రం బీసీ కాలనీలో వినాయక నిమజ్జనానికి పూనుకున్నారు. సాయంత్రం 8.30గంటల సమయంలో మసీదు పక్కన ఉన్న వినాయక దేవాలయం నుండి వినాయకుడిని ఊరేగిస్తూ నిమజ్జనానికి బయలుదేరారు. ఆ సమయంలో టపాసులు కాల్చే ప్రయత్నంలో ఒక్కసారిగా టపాసులు పేలి 30మంది తీవ్రంగా గాయపడ్డారు. చాలా మందికి చెవులు, ముక్కులు, చేతులకు గాయాలయ్యాయి. టపాసులు కాల్చే ప్రయత్నంలో వీధిలో ఒక దిక్కు పెట్టిన టపాసులపై నిప్పు రవ్వలు పడి ఉన్న పలంగా భారీ శబ్దాదలు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో అక్కడే గుంపులుగా ఉన్న మహిళలు,పిల్లలు, యువకులు ఈ టపాసుల పేలుళ్ళకు తీవ్రంగా గాయపడ్డారు. ఏమి జరిగిందే తెలియక గందరగోళం నెలకొంది. ఈ ఘటన బాంబు బ్లాస్టను మరిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై రాకేష్ ఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటీన గుడూరు, నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బీసీ కాలనీ అంతా వినాయక నిమజ్జనం వల్ల గందరగోళం నెలకొంది. ఈ టపాస్‌లు విస్ఫోటనం, శబ్దాల వల్ల బీసీ కాలనీ దద్దరిల్లిపోయింది. మహిళలు, పిల్లల ఆర్తనాదాలతో గందరగోళం నెలకొంది. టీడీపీ నాయకులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారికి పరిచర్యలు ప్రారంభించారు. వినాయక చవితి నిమజ్జనం చేసే వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## 150రకాల ప్రసాదాలతో పూజలందుకున్న గణనాదుడు



**బిట్రగుంట, సెప్టంబర్15, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన బోగోలు ఆంధ్రబ్యాంక్ వీధిలో వినాయక చవితి సందర్భంగ నెలకొల్పబడిన గణనాదునికి నవరాత్రుల ఉత్సవాలలో బాగంగ ఆదివారం 150రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలందుకున్నాడు. అనంతరం గణనాదుడ్ని వైభవంగ ఊరేగింపు నిర్వహించి గణేష్ కమిటి ఆధ్వర్యంలో తాడిచెట్లపాళెం సముద్రతీరాన నిమజ్జనం చేశారు.

## గోవింద నామస్మరణతో గరుడసేవ ఉత్సవం



**బిట్రగుంట, సెప్టంబర్15, ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రిగోవింద నామస్మరణతో గరుడసేవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈఉత్సవంలో కొండబిట్రగుంట, పాతబిట్రగుంట చుట్టుప్రక్కల గ్రామాలనుంచి విచ్చేసిన భక్తులు గరుడవాహనంపై ఊరేగిన శ్రీప్రసన్నుడ్ని దర్శించుకొని భక్తి పారవస్యంతో తన్మయత్నం పొందారు. అనంతరం ఆలయ కార్య నిర్వహణాదికారి అరవ రాధాకృష్ణ పర్యవేక్షణలో భక్తులకు తీర్ధప్రసాదాలు పంపిణిచేశారు.

## పాతబిట్రగుంటలో శ్రీషిరిడిసాయినాదునికి ప్రత్యేకపూజలు



**బిట్రగుంట, సెప్టంబర్15, ప్రభాతవార్త:** బోగోలు మండలం పాతబిట్రగుంటలోని ద్వారకానగర్‌లో శ్రీషిరిడిసాయిబాబ మందిరంలో ఆదివారంశ్రీశేషసాయిబాబాకు ప్రత్యేకపూజలు సహస్రనామ అర్చనలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక అద్యక్షుడుకుట్టుబోయిన బ్రహ్మానందం ఆద్వర్యంలో అల్లూరుకు చెందిన వాసవి వనిత క్లాబ్ డివిజనల్ సెక్రటరి లక్ష్మిని ఘనంగా సత్కరించారు. కావలిడివిజన్‌లో సమాజసేవతోపాటు దైవ కార్యక్రమాలలో, దానదర్మాలలో విరివిగ పాల్గొని తమదైన పాత్రపోషిస్తు సనాతన ధర్మకోసం సాంప్రదాయాలుసంస్కృతిని కాపాడడంలో తనవంతు కృషిచేస్తున్నారని ప్రశంశించారు. ఆమెను ఆదర్శంగ తీసుకొని ప్రతి ఒక్కరు సనాతన ధర్మకోసం కృషిచేయాల ని ఆకాంక్షించారు.

## పంచాయతి త్రాగునీటి పైపులైను ద్వంసం



**జలదంకి, సెప్టంబర్15, ప్రభాతవార్త:** జలదంకి ప్రజల దాహార్థిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన త్రాగునీటి పైపులైన్‌ను శనివారం రాత్రి ఎవరో గుర్తుతెలియని వారు ద్వంసం చేశారు. గ్రామస్తులు మంచినీటి వసతిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో స్థానిక ముస్లిం స్మశానస్థలంలో నిర్మితమైవున్న బోర్‌నుంచి పైపులైను వేసి నీరందిస్తున్నారు పంచాయతివారు. ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి వార్డు సభ్యులు గోసు ప్రసాద్ తదితరులు దగ్గరుండి సమస్యను పరిష్కరించాలన్న దృఢసంకల్పంతో పైపులైల్ ఏర్పాటుచేశారు. నీటి సరఫరాను చూసి ప్రజలు ఎంతోసంతోషించారు. అయితే దీనిని జీర్ణించుకోలేని ఎవరో పైపులైను ద్వంసానికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం దీనిని గుర్తించిన గ్రామస్తులు వెంటనే విషయాన్ని ఉపసర్పంచ్ మాలకొండారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వారు వెళ్ళి పరిశీలించి కార్యదర్శికి తెలిపారు. అదేవిందంగ ఉదయగిరి నియోజ కవర్గ శాసనసభ్యుడు కాకర్ల సురేష్ దృష్టికికూడా నేతలు తీసుకుపోయి వివరించారు. ఆయన ఎస్ఐ లతీపున్నీషతో మాట్లాడారు. దీనికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎర్రబాటలో అగ్రభాగాన నిలిచిన కామ్రేడ్ సీతారాం ఏచూరి



**జలదంకి, సెప్టంబర్15, ప్రభాతవార్త:** భారత కమ్యునిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి గొప్ప పోరాటయోధుడని ఎర్రబాటలో అగ్రభాగాన నిలిచిన ధీరుడి మృతి తీరని లోటని సిపియం జిల్లా నేత తాళ్ళూరు మాల్యాం ద్రి, వ్యవసాయ కార్మికసంఘం నేత రావి మాల్యాద్రిలు పేర్కొన్నారు. స్థానిక సురే చెంచురెడ్డి భవన్‌లో ఆదివారం సంతాపసభ నిర్వహించారు. ఈసందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాలలువేసిఘన నివిళులర్పించారు. ఈసందర్భంగ మాల్యాద్రి మాట్లాడుతు మార్కిస్టు పార్టీ ఒక గొప్ప నాయకుడ్ని కోల్పోయిందని ఏచూరి మరణం పీడితజనులకు తీరని లోటని అన్నారు. సామాన్య కుటుంభంలో జన్మించి విద్యార్ది నాయకుడిగ ఎదిగి పార్టీలో చేరి అందనంత ఎత్తుకెదిగిన కామ్రేడ్‌అని కొనియాడారు. ప్రధాన కార్యదర్శిగ కార్మిక, కర్షకుల నిరంతరం పోరు సల్పారని అన్నారు. పార్లమెంట్ సభ్యునిగ ప్రజలకొరకు ఎలుగెత్తిప్రజావాణిని సమర్ధవంతంగ వినిపించేవాడని కొనియాడారు. దేశం మతంవైపు వెళ్ళకుండ అడ్డుకుంటు దేశ ప్రయోజనాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేశాడని తెలిపారు. ఆయన చూపిన పోరుబాటలో పార్టీ శ్రేణులు పయనించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నేతలు మేలంగి ఆంతోని, గడ్డం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## 17 నుండి నులుపురుగుల మాత్రల పంపిణి



**సీతారామపురం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** జాతీయ నులుపురుగుల కార్యక్రమం ఈనెల 17 వతేది జరుగుతుందని ఆదివారం మెడికల్ ఆఫీసర్ ఎ .స్వప్నరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతు అంగన్‌వాడీ స్కూల్ పిల్లల నుండి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకునే విద్యార్థుల వరకు ఈ ప్రోగ్రామంలో భాగంగా ఆల్‌బండ్‌జోల్ ట్యాబ్‌లేట్లు వేసుకోవాలని ఒకటి నుండి 2 సంవత్సరం లోపు పిల్లలకు సగం మాత్ర రెండు నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి నమిలించి మింగించాలని అన్నారు. ఈ ప్రక్రియ వల్ల పిల్లలు వారి కడుపులో ఉండే నులుపురుగులు వేలిక పాములు చనిపోయి పిల్లలకు కడుపులో నొప్పి, వాంతులు, విరోచనాలు రాకుండా ఉంటాయని అన్నారు. ముఖ్యముగా వారికి రక్త హీనత రాకుండా ఉంటుందని అన్నారు. రక్తహీనత వలన పిల్లలకు చదువు మీద ఏకగ్రత తగ్గుతుందని పిల్లల బరువు తగ్గుతుందని నీరసంగా ఉంటారని అన్నారు. మండలంలోని 44 అంగన్ వాడీ స్కూల్స్‌లో 861 మంది 43 స్కూల్స్, 3 జూనియర్ కాలేజిలు ఒక డిగ్రీ కాలేజి నందు 3033 మంది బయట బడికి రాని 222 మంది పిల్లలు మొత్తం 4 వేల 116 మంది ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మద్యహ్నం బోజనం చేసిన తరువాత ఈమాత్ర నమిలించి మింగాలని అన్నారు.

## కమ్మ సేవా సంఘం భవన నిర్మాణ పనులను పర్యవేక్షించిన టిడిపి నేత మాలేపాటి



**కావలి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని కమ్మ సేవా సంఘం భవన నిర్మాణ పనులను ఆదివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పర్యవేక్షించారు. అనంతరం కమ్మ సేవా సంఘం నేతలతో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కమ్మ సేవా సంఘం అధ్యక్షులు మాకినేని మాల్యాద్రి, కమ్మ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అందరి కోఆర్డినేషన్‌తో ముందుకెళదాం సమస్యల్ని పరిష్కరించుకుందాం



జలదంకి, సెప్టంబర్15, ప్రభాత వార్త:గ్రామాలలో సమస్యల పరిష్కారదిశగ ఒక నూతన వరవ డితో ముందుకెళ్లి అందరం సమ స్వ యంతో పనిచేసిఅభివృద్ధిని సాదించుకుందామని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు.ఆదివారం జల దంకి మండలం జమ్మలపాళెంలో పంచాయతి ప్రజాదర్బార్ స్థానిక సచి వాలయంలో నిర్వహిం చారు.ఈసందర్భంగ ఆయన మాట్లాడుతు ఈకార్యక్రమం వుద్దేశ్యాన్ని వివరించారు అందుకు అందరం సమి ష్టిగ ముందుకెళదామని అన్నారు.ప్రయోగాత్మకంగ శ్రీకారంచుట్టే దర్మార్‌లో మంచిఫ లితాలను ఆశిస్తు న్నామని వెల్లడించారు.ఇక్కడ నెలకొన్న సమస్యలను వినతుల రూపంలో దృష్టికివాచ్చాయని వాటిని ప్రాధా న్యతా క్రమంలో పరిష్కరించుకుంగామన్నారు.ముఖ్యంగ పంచాయతిలో సిసి రోడ్లు,డ్రైనేజి కాలువలు ,పారి శుద్యం,త్రాగునీటి సమస్య,నుడా లేఔట్లుల్లో భూములు కోల్పోయిన కొంతమందికి నష్టపి హారం,అంగన్‌వాడి భవనాల నిర్మాణాలు తదితరాలు ప్రధానంగ వున్నాయని వాటిని ఒక్కొక్కటిగ పరిష్కరి స్తామన్నా రు.అదికారులు పట్టనాలలో పనిచేయడం వేరు ఉదయగిరి నియోజకవర్గంలో పనిచేయడం వేరుగ వుంటుందని మోర్ రెస్పాన్స్ బులిటీతో ఖచ్చితత్వంలో విధులు నిర్వహిస్తేనే అనుకున్న ఫలితాలను సాదించగ లుగుతామన్నారు.ఎన్నికలు అయిపోయాయి కాబట్టి ఇక్కడ పార్టీలకు తావులేదు మంచిజరుగుతందన్నఆశతో తనపై అపార నమ్మకంవుంచి నన్ను ఎంఎల్‌ఏగ ఎన్నుకున్నారు.కావున వారి ఆశలకనుగుణంగ పార్టీ రహితంగ అందరికి మేలు చేస్తామనిస్పష్టంచేశారు.అందరం స్నేహపూర్వకంగ మెలుగుదామని హర్షద్వా నాలమద్య అన్నారు.గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహనిర్మాణాలు ప్రాసస్ ప్రకారం జరగలేదని దా నిని సరిచేయాల్సి వుందన్నారు.ఈనెల 17నుంచి నూతన గృహనిర్మాణ లబ్ధిదారు లను గుర్తించే పనిలో ప్రభుత్వంవుందని కావున ఇళ్ళులేనివారు,వినతులు సమర్పించాల్సిందిగకోరా రు.ఇం జనీర్‌డే సందర్భంగ ఇంజనీర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అన్నిశాఖల అధికారులతో కలసి ఎంఎల్‌ఏ ఫోటో దిగారు.సర్పంచ్ బుర్రి శ్రీవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి గోచిపాతల వెంకటరమణయ్య ,మండలపార్టీ అధ్యక్షుడు పులిగుంట మధురెడ్డి,సీనియర్ నేత వంటేరు జయచంద్రారెడ్డి,స్థానిక టిడిపినేత నక్కా మధవరావు తోపాటు మండల కూటమి నేతలు ప్రజలు పాల్గొన్నారు.

## సిఐ శ్రీనివాసులురెడ్డిని సన్మానించిన వాలీబాల్ క్రీడాకారులు



బుచ్చి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం నూతన సిఐగా బా ధ్యతలు స్వీకరించిన పి. శ్రీనివా సు లురెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలోని వాలీబాల్ క్రీడాకారులు ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు పి.తిరప తయ్య, భీమతాటి వెంకటరమణయ్య, కె.మహేష్, టివి సురేష్, జాతీయ క్రీడాకారుడు పిహేమంత్‌లు మాట్లాడు తు సిఐ శ్రీనివాసులురెడ్డి మంచి వాలీబాల్ ప్లేయర్ అని వారు తెలి పారు. అలాగే ఆయన క్రీడా పోషకుడు అని వారు ప్రశంసించారు. ఆయన బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీకి రావడం అదృష్టమని వారు అభివర్ణించారు.

## అల్లూరులో టైరు బండి ఎద్దుల పోటీలు



అల్లూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త అల్లూరులో రాష్ట్ర స్థాయి జూనియర్ టైరు బండి ఎద్దుల పరుగు పందెం పోటీలను ఆదివారం కాటంరెడ్డి ఆది నారాయణరెడ్డి మెమోరియల్ ద్వారా కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎద్దుల పం దెందార్లు పోటీలో పాల్గొనగా వారిని ప్రజలు ప్రోత్సహించారు. పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమ తిని కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి 25 వేల 116 రూపాయలను పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో ఎస్ఎస్ బ్రదర్స్ అల్లూరు వారు అందుకున్నారు. ద్వితీయ బహుమతి దండా కృష్ణారెడ్డి 20 వేల 116 రూపాయలు పాప బోయిన ఖ్యాతిశ్రీ ఇస్కపల్లి వారికి అందజేశారు. తృతీయ బహుమతి మన్నెమాల నారపరెడ్డి జ్ఞాపకార్థం 15 వేల 116 రూపాయలు మన్నెమాల సుకుమార్‌రెడ్డి చాముండేశ్వరి సీఫుడ్స్ గంగపట్నం వారికి అందజేశారు. 4వ బహుమతి కరేటి వినోద్‌కుమార్ జ్ఞాపకార్థం 10 వేల 116 రూపాయలు కరేటి దైవాదీనం, చంద్ర లీలమ్మలు అలారి భావిక ముదివర్తి వారికి అందజేశారు. 5వ బహుమతి పప్పు వెంకయ్య జ్ఞాపకార్థం 7 వేల 116 రూపాయలు పప్పు బ్రదర్స్ అత్తిరాజుల లాస్య యల్లాయపాలెం వారికి అందజేశారు. ఈ పోటీ లను అనంతరాజు బాలకృష్ణంరాజు, గోసల గోపాలరెడ్డి, పద్మనాభరెడ్డి, దండా కృష్ణారెడ్డి, నీలం సాయి కుమార్, తదితరులు పర్యవేక్షించి బహుమతులు అందజేశారు.

## కావలి డిఎస్పీ వెంకట రమణ బదిలీ



కావలి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త కావలి డిఎస్పీగా పనిచేస్తున్న వెంకట రమణను మంగళగిరి డిఐపి కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని బదిలీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆయనకు ఉత్తర్వులు అందాయి. డిఎస్పీ వెంకట రమణ సంవత్సరం పది నెలల పాటు కావలిలో పనిచేశారు. అలాగే డిఐజి వెయిటింగ్‌లో వున్న పి.శ్రీధర్‌ను కావలి డిఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. నెల్లూరు సిసిఎస్‌లో గతంలో పి.శ్రీధర్ డిఎస్పీగా పనిచేశారు.

## గ్రామీణ పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే జీవన్ ఆయుష్క ప్రాజెక్ట్ లక్ష్యం




ముత్తుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త గ్రామీణ పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే జీవన్ ఆయుష్క ప్రాజెక్టు లక్ష్యమని డాక్టర్ మాల్యాద్రి పేర్కొన్నారు. ఆదివారం వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జీవన్ ఆయుష్క ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరంలో అర్హత కలిగిన వైద్యులు, సాంకేతిక నిపుణుల చేతులమీదుగా ఉచిత నిర్ధారణ సేవలు, ఉచిత మందులు పంపిణీ చేయడం జరుగు తుందన్నారు. ఈ శిభిరంలో సుమారు 120 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడమే ఈ జీవన్ ఆయుష్క ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం అన్నారు. వసంత లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఇలాంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సహాయం చేస్తూ, సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ అమ్మనమ్మ, డాక్టర్ విజయ, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సుమతి మిత్రమండలి చొరవ స్ఫూర్తిదాయకం



కోవూరు, సెప్టెంబరు 15 ప్రభా తవార్త : విజ యవాడలోని పలు ప్రాంతాల్లో అకాల వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న పలు కాలనీ లను గుర్తించి కోవూరుకు చెందిన సుమ తి,ఆమె మిత్రమండలి సభ్యులు రెండవసారి ఆదివారం కూ డా ఆ ప్రాంతాలకు వెళ్లి బాధి తులకు తమ వంతుగా లక్షరూపా య లకు పైగా విలువ చేసే దుప్పట్లు, ఫ్రూట్లు, బిస్కెట్లు పంపిణీ చేసి వారి చేత శభాష్ అనిపించుకు న్నారు. గత వారం కూడా సుమతి మిత్రమండలి సభ్యులు వరద బాధిత ప్రాంతాలకు వెళ్లి పాలు, బ్రెడ్లు, దుప్పట్లు , పండ్లు పంపిణీ చేశారు. మరలా ఆదివారం కూడా వెళ్లి బాధితులకు తమవంతుగా సహకారం అందించారు. సుమతితో పాటు వారి మిత్రమండలి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైభవంగా గణేశుని నిమజ్జనం



కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆదివారం సంబంధిత విగ్రహ కమిటీ నిర్వాహకులు యువకుల ఉత్సాహాల మధ్య నిమజ్జనానికి బయలుదేరారు. దారిపొడవునా యువకులు ఒక రిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ప్రజలకు ప్రసాదాలు పం చుతూ ఈ నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ని ర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆత్మకూరులో ఘనంగా ఇంజనీర్స్ డే



ఆత్మకూరు, సెప్టెంబర్15 ప్రభా త వార్త: ఆత్మకూరు పట్టణంలోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాల య్రం లో ఆదివారం ఇంజనీర్స్ డే సంద ర్భంగా ఘనంగా కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా మోక్షగుం డం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఆత్మ కూరు ఇరిగేషన్ సబ్‌డివిజన్ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ ఆర్.వెంకటేశ్వర్లు పూ లమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో విశ్వేశ్వరయ్య చేసిన సేవలు , సంస్క రణలకు గుర్తుగా సెప్టెంబర్15వ తేదీని ఇంజనీర్స్‌డే గా ప్రకటించారన్నారు. ఈసందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ అన్ని ఇంజనీరింగ్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆత్మకూరులో తమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కార్యాలయ సిబ్బందితో ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. విశ్వేశ్వరయ్య జీవితాన్ని, సేవలను ఆదర్శంగా తీసుకొని ఇంజనీరింగ్ అధికారులు ముందుకు వెళ్ళాలని వెంకటేశ ్వర్లు కోరారు.

## సమిష్టి సహకారంతోనే వేలం ప్రక్రియ విజయవం



మర్రిపాడు, సెప్టెంబర్15ప్రభాతవార్త: నెల్లూరుజిల్లా డిసిపల్లి వేలం కేంద్రంలో అందరి సమిష్టి సహకారం తోనే వేలం ప్రక్రియ 125 రోజుల పాటు జరిగి విజయవంతంగా ము గిసిందని వేలంకేంద్ర నిర్వహణా ధికారి జి.రాజశేఖర్ పేర్కొన్నారు. వేలం కేంద్ర ఆవరణలో డిసిపల్లి రైతు సంఘం ఆధ్వర్యంలో ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ డిసిపల్లి వేలంకేంద్రంలో రైతు నాయకులు, రైతులు, కంపెనీ ప్రతినిధులు, బోర్డు సిబ్బంది , ముఠావర్కర్స్ అందరి సమన్వయంతో రాష్ట్రంలోనే నెంబర్-1గా పేరుప్రఖ్యాతలు సాధించగలి గామన్నారు. వేలంకేంద్రంలో రైతులకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించిందన్నారు. వేలం ప్రక్రియలో నగదు ప్రక్రియ చెల్లింపులకు సంబంధించి 15రోజులు ఉన్న గడువును 8రోజులకే తీసుకువ చ్చా మన్నారు. వేలం కేంద్ర పరిధిలో రైతులకు అందించే సేవలను పొగాకుబోర్డు కంప్యూటరైజ్ చేసిందన్నారు. పొగాకు బ్యారన్ రిజిస్ట్రేషన్ నుంచి కొనుగోలు ప్రక్రియ వరకు రైతులు తమ మొబైల్ ద్వారానే లావాదేవీలు చూసుకోవచ్చన్నారు. రానున్న రోజుల్లో కాగిత రహిత సేవలు రైతులకు అందిస్తారన్నారు. రైతులకు గిట్టు బాటు ధరలు, మిగిలిన సేవల కల్పనలో రైతు నాయకులు తమకు అందించిన తోడ్పాటు మరువరానిదని, ఈ విషయంలో రైతుసంఘం నాయకులు గాలి నరసపనాయుడు, మూలి వెంగయ్యలు అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా రాజశేఖర్ తెలిపారు . డిసిపల్లి రైతుసంఘ నాయకుడు గాలి నరసపనాయుడు మాట్లాడుతూ వేలంకేంద్ర పరిధిలోని రైతులకు ఈ సంవత్సరం మంచి ధరలు లభించాయన్నారు. రానున్న 2024-25సీజన్‌కు రైతులు బోర్డు నిర్ణయించిన విస్తీర్ణంలో పొగాకు సాగుచేసి నాణ్యమైన పొగాకును పండించాలన్నారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను పొగాకుబోర్డు సమకూరుస్తుందని, రైతులంతా బోర్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అధ్యక్షుడు మూలివెంగయ్య మా ట్లాడుతూ పొగాకు మార్కెట్‌లో మిగిలిన పంటల మాదిరి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ముం దుకు రావాలన్నారు. బోర్డు అధికారులు, కంపెనీ కొనుగోలుదారులు ఈ సంవత్సరం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో సహకరించారన్నారు. మున్ముందుకూడా అదే సహకారాన్ని అందించాలని కోరారు. ఈసందర్భంగా వేలంకేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా విజయవంతంగా రైతులకు సేవలందిస్తున్న వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్‌ను రైతుసంఘం నాయకులు, రైతులు ఘనంగా సన్మానించారు. అంత కుముందుకు పొగాకు కొనుగోలుదారులను, పొగాకుబోర్డు సిబ్బందిని రైతులు సత్కరించారు. ఈకా ర్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, దామా సుబ్బా రావ్, ఏనుగుల భాస్కర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి నారాయణరెడ్డి, ఖాజావలి, రాసాల పెంచలయ్య ,వేలంకేంద్ర పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఏ కాకర్ల

జలదంకి, సెప్టంబర్15, ప్రభాతవార్త:జలదంకి అరుందతీ వాడలో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌పాల్గొన్నారు.వధూవరులైన మల్లెల అరుణ్‌కుమార్,మీనాక్షిలను దీవించారు.కాలనీవాసులతో కలివిడిగ మాట్లాడి సందడి చేశారు.ముఖ్యంగ దళిత యువత ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.మొన్న ఎన్నికల్లో పార్టీకోసం పనిచేసిన అందర్ని పేరుపేరున పలక రించి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు.అనంతరం ఐటిడిపి మండల అధ్యక్షుడు,మాజీ మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ఏగూరి రఘునివాసానికి వెళ్ళి బుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగ మాట్లాడారు.ఈసందర్భంగ ఏగూరి మొన్న విజయవాడలో సంభవించిన వరదల్లో నష్టపోయిన భాధితుల కోసం తనవంతుగ 20వేల నగదును ఎంఎల్‌ఏకు అందజేశారు.అయితే కేవలం చెక్కు రూపంలో అయితేనే తాను స్వీకరిస్తానని నగదు కాబటి పార్టీ మండల అద్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డికి అందిస్తే ప్రాసె స్ ప్రకారం నడుస్తుందని తెలిపారు.కాకర్ల రాకతో కాలనీవాసుల అందరిలో ఆనందోత్సహాలు నిండాయి.

## పంగిలి,రామిరెడ్డి పల్లి గ్రామాలలో భక్తి శ్రద్ధలతో గంగమ్మ పొంగళ్ళు



పంగిలి(రాపూరు),సెప్టంబరు15ప్రభాతవార్త మండలంలోని పంగిలి,రామిరెడ్డి పల్లి గ్రామాలలో ఆదివారం శ్రీ గంగమ్మ తల్లికి పొంగళ్ళు కార్యక్రమనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని యాదవులు తమ కులదైవమైన గంగమ్మ తల్లికి ఊరేగింపుగావెల్లి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.గంగమ్మ పొంగళ్ళు సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం,ప్రత్యేక పూలాంగి సేవ,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి, మండల టిడిపి ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, మండల టిడిపి నాయకులు చెన్ను బాస్కర రెడ్డి,చెన్ను అశోక్ రెడ్డి, నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి,బొమ్మిరెడ్డి రవీంద్రా రెడ్డి,డాక్టర్ వంకిపోలు వంశీకృష్ణా రెడ్డి,అకిలివలస,తూమాయి గ్రామ సర్పంచ్‌లు చెన్ను పెంచల రెడ్డి,పైడిపూల చంద్రమోహన్,చీర్ల రామయ్య,దేసు బాస్కర రెడ్డి,నల్లవడ్ల రాధాకృష్ణా రెడ్డి,బిల్లు వెంకటరత్నం,పైడిపూల చంద్రమోహన్ తదితరులు దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## 25 మంది నేత్రదానంకి అంగీకారం



కలువాయి సెప్టెంబర్ 15 ప్రభా తవార్త మండలకేంద్రమైన కలు వా యిలో నేత్రదానం స్వచ్ఛంధంగా చేసేందుకు 25 మంది యువత అంగీకరించి రిజిష్టేషన్ చేయించు కోవడం జరిగింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కలువాయి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ జి.పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్ధానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపం నందు నేత్రదానం అంగీకార శిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి నెల్లూరు జిజి హెచ్ హాస్పటల్ ఆప్తమాలజిస్టు ఆఫీసర్ పి. శైలజా పాల్గొని 25 మంది రక్తదానం చేసేందుకు అంగీకరించగా రిజిష్టేషన్ చేయించడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చనిపోయిన మూడు నుండి 6 గంటలకు సమాచారం తెలియజేసినట్లు అయితే వారి నుండి నేత్రాలు స్వీకరించి సకాలంలో అవసరమైన వారికి తెలియజేస్తామని అన్నారు. అదే విధంగా కంటికి సంబందించిన ఎటువంటి సమస్యలు అయినా ప్రభుత్వం లేదా ప్రవేటు హాస్పటల్‌లో వారి ఆద్వర్యంలో చికిత్స చేయిస్తామని తెలిపారు. మనం చనిపోయిన తరువాత కూడా మరొకరికి మన కళ్లతో వెలుగు నింపి శాశ్వతంగా జీవించ గలమని ఎంతో సహృదయంతో ఇండియన్ రెడ్ క్రాస్ తరపున కార్యక్రమానికి సహకరించిన వారికి అభినందనలు తెలిపారు. రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, ఎం రాంబాబు, ఎ మల్లికార్జునయ్య,ఎం చిన్నయ్య,పువ్వాడి నరేష్ ,శ్రీనివాసులు దయాకర్, కామేశ్వరీ తోకల ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై అసత్య ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులపై చర్యలు తీసుకోండి



పొదలకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త మాజీ మంత్రి కాకాని గోవర్ధర్ రెడ్డిపై పొదలకూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, టిడిపి కార్యకర్త అనీల్ కుమార్ రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి జిల్లా కార్యదర్శి గోగిరెడ్డి గోపాల్ రెడ్డి పొదలకూరు ఎస్ఐకి ఫిర్యాదు చేసారు. ఇసుక క్వార్ట్జ్‌లలో కోట్లు దోచుకున్నారని 15 కోట్ల అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయిన ఎంఆర్ఓ. శ్వాతి అక్రమార్జనలో కాకాని గోవర్ధన్ రెడ్డికి వాటా వుందని పదే పదే పత్రికా సమావేశాలు పెట్టి సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో పదే పదే పార్వెడ్ చేస్తున్నారని తెలిపారు. దీంతో గ్రామాల్లో శాంతి లోపించి గొడవలకు దారి తీసే పరిస్థితితులు ఉన్నాయన్నారు. అలాగే శాంతి భద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందని చెప్పారు. అందువల్ల తలచీరు మస్తాన్‌బాబు, ఎ. అనీల్ కుమార్ రెడ్డిలపై కేసు నమోదు చేసి విచారించి తగు చర్యలు తీసుకోవాలని పొదలకూరు ఎస్ఐని ఆయన కోరి వారిపై ఫిర్యాదు చేసారు.




## నేరాలపై పాల్పడితే ఉపేక్షించేది లేదు



కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : సమా జంలో రౌడీ షీటర్లుగా అనుమానితులుగా ఇత రత్రా కేసుల్లో ముద్ర పడిన వ్యక్తులు ఇకనైనా తమ పాత తీరు మార్చుకుని సమాజంలో బు ద్ధిగా బతకాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సూచించారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాం గణంలో ఆదివారం ఇటువంటి వారికి కౌన్సి లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధమైన ముద్ర పడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులో ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉండడం జరుగుతుందన్నారు. గొడవలు, దౌర్జన్యాలు, ఇతర నేర కార్యకలాపాల్లో పాల్గొన్నా.. నేరాలు చేసినా అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ నేపథ్యంలో పాత జీవితానికి స్వస్తి చెప్పి కొత్త జీవితానికి ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు.

## పోరాటయోధుడికి ఘన నివాళులు



కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : కోవూరులోని సీతాపోలయ్య భవ నంలో ఆదివారం జాతీయ సీపీఎం ప్ర ధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏ చూరి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిలపక్ష నాయ కులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం భారత వామపక్ష ఉద్యమానికి తీరని లోటేనన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఆయన చూపిన పోరాటం భావితరాల వారికి స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థి రాజకీయాలతో రాజకీయాలు ప్రారంభించి సీపీఎం పార్టీలో అత్యున్నత పదవి పొందిన వ్యక్తి ఆయనే అన్నారు. యూపీఏ ప్రభుత్వం అమలులోకి వచ్చిన ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం రూపకల్పనలో ఆయన పాత్ర కీలకమన్నారు. రెండు సార్లు రాజ్యసభ్యుడిగా ఎన్నికై రాజ్యసభలో అనేక బిల్లుల పైన, దేశ విదేశ సమస్యల పైన తమదైన శైలిలోఎ చర్చలు చేసి ఉత్తమ పార్లమెంట్ ఏరియన్‌గా ఎన్నికయ్యారన్నారు. అటువంటి ప్రతిభాశాలి అయిన సీతారాం ఏచూరి తెలుగు వ్యక్తి కావడం మనకు గర్వకారణం అన్నారు. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్య లేకపోవడం దేశ రాజకీయాలకే తీరని లోటేనన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి అఖిలపక్ష నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, సీపీఎం నాయకులు జె. వెంకమరాజు, న్యాయవాది జక్కా శేషమ్మ, గండవరపు శేషయ్య, ప్రజా నాట్యమండలి విజయ్‌కుమార్, బుజ్జయ్య, ఎస్‌కే బాబు, సుబ్బారావు, తదితరులు ప్రసంగించారు.

## టీకాల కార్యక్రమం విజయవంతం



కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : కోవూరు పశు సంవర్ధక సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు , విడవలూరు మండలాల్లో పాడి రైతులకు సంబంధించిన పశువులకు , మేకలు, గొర్రెలకు కూడా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను నూరుశాతం వేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే ప్రధానం అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులను గుర్తించి సకాలంలో టీకాలు వేసేలా పాడి రైతులు తగు చొరవ తీసుకోవాలన్నారు. కోవూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన అన్ని ప్రాంతాల్లో పశు సహాయకులు, గోపాలమిత్రల ద్వారా ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను నూరుశాతం వేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో మేలుజాతి దూడల ఉత్పత్తి కొరకు పాడి రైతుల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై కూడా పాడి రైతుల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన పాడి రైతులకు ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ప్రయోగశాల సేవలను ఆయా గ్రామాల పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వరదబాధితులకు లక్షరూపాయల విరాళం



వింజమూరు, సెప్టెంబర్15ప్రభాతవార్త: ఎస్ఎల్ ఎన్ మార్కెటింగ్ ప్రవేట్ లిమిటెడ్ ఎండి కొలకపూడి భవాని , చీఫ్ అడ్వైజర్ కొలకపూడి బ్రహ్మారెడ్డి లు వరద బాధి తుల సహాయార్థం లక్షల రూ పాయల విరాళం చెక్కును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురే ష్‌కు ఆదివారం అందజేశారు. తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యాలయంలో కొలకపూడి భవాని, బ్రహ్మా రెడ్డిలు ఎమ్మెల్యేను కలిసి చెక్కును అందజేసి తమ వంతుగా ఈ చిరుసహాయాన్ని అందించామన్నారు. చెక్కును అందజేసిన వారిని ఎమ్మెల్యే సురేష్ అభినందించారు.

## ధాతృత్వం చాటుకున్న బొల్లినేని తనయులు



వింజమూరు, సెప్టెంబర్15ప్రభాతవార్త: వరద బాధితుల సహాయార్థం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు తన యులు ధనుష్, కార్తీక్, బంధువులు రమ ణయ్యనాయుడులు వరద బాధితుల సహా యార్థం కోటిరూపాయల చెక్కును ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు ఆది వారం అందజేశారు. ఇటీవల విజయవాడ లో కురిసిన భారీ వర్షాలకు వరద ముంపుకు లోనై నిరాశ్రయులైన ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని, ప్రజలను ఎంతో కొంత తమవంతుగా ఆదుకోవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటిరూపాయలను విరాళంగా అందజేశామన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి బొల్లినేని ధనుష్, కార్తీక్‌లను అభినందించారు.

## ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



ఆత్మకూరు, సెప్టెంబర్15ప్రభాతవార్త: మండలంలోని పరిధిలోని అప్పారా వు పాళెం గిరిజన కాలనీలో ఆదివారం కడ పజిల్లా ,ఉడుమువారిపల్లికి చెందిన ఈగ శ్రీనివాసులురెడ్డి మొదటి వర్ధంతి సందర ్భంగా ఐక్య ఫౌండేషన్ ఆధ్వ ర్యం లో ఫౌండేషన్ ప్రతినిధులు , గిరిజనులు శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఐక్యఫౌండేషన్ ఛైర్మెన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ ఈగ పృద్వీరెడ్డి, ఈగ ప్రభుధర్‌రెడ్డి, కుటుంబ సభ్యుల సహకారంతో ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 120మంది పైగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదని సమయానికి ఆహారం దొరకక ఎంతోమంది ఆకలి బాధతో అలమటిస్తున్నారని అలాంటి వారికిఅన్నదాన కార్యక్రమం ద్వారా ఆకలి బాధతో అలమటిస్తున్నారని అలాంటి వారికి అన్నదాన కార్యక్రమం ద్వారా ఆకలి బాధ తీర్చడం అనేది శుభ పరిణామమని ఆ కుటుంబ సభ్యులకు ఐక్య ఫౌండేషన్, గిరిజనుల తరపున ధన్యవాదాలు. ఐక్యఫౌండేషన్ ఛైర్మెన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి, ఐక్య ఫౌండేషన్, రాష్ట్ర డైరెక్టర్ పయ్యావుల మారుతినాయుడు, ఈగ ప్రభావతమ్మ, కామాక్షయ్య,పావని ,యశ్వంత్,సాయి,రిషిత,సునీల్, అక్షిత్,ఫౌండేషన్‌సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా బంగారమ్మ తల్లికి పూజలు



విడవలూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త మండలం అలాగనిపాడు గ్రామంలో వెలసి వున్న శ్రీ బంగారమ్మ తల్లికి ఆదివారం పూజల నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అదే విధంగా సాయంత్రం అంగరంగ వైభవంగా వివిధ రకాలపూలతో అలంకరించారు. మహిళలు ఉదయం పెద్ద ఎత్తున పాల్గొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దీంతో భక్తులకు అమ్మవారు మహంకాళి రూపంలో దర్శనమిచ్చారు. ఈ